క్లుప్తంగా

ఎమ్మెల్యే సంతాపం

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మున్సిపాల్టీ పరిధిలోని 1వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త గేదెల చిన్నయ్య అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం తుదిశ్వాస విడిచిపెట్టాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆయన నివాసానికి వెళ్లి మృతదేహంపై పూలమాలవేసి కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

జేసీఎస్ మండల కన్వీనర్ల నియామకం

సాలూరు: నియోజకవర్గ జేసీఎస్ మండల కన్వీనర్లను నియమిస్తూ వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ మేరకు సాలూరు పట్టణ కన్వీనర్‌గా గిరిరఘు, మండల కన్వీనర్‌గా కళ్లేపల్లి త్రినాథనాయుడు, మక్కువ మండల కన్వీనర్‌గా మావుడి తిరుపతిరావు, పాచిపెంట మండల కన్వీనర్‌గా తట్టికాయల గౌరీశ్వరరావు, మెంటాడ మండల కన్వీనర్‌గా కనిమెరక త్రినాథరావులు నియమితులయ్యారు.

లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనృసింహ స్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖినది ఒడ్డున వేంచేసిన వేణుగోలస్వామి ఆలయప్రాంగణంలో కొలువైన లక్ష్మీనృసింహ స్వామికి గురువారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ మేరకు ఆలయ ప్రధాన అర్చకుడు పి. శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు గురువారం కావడంతో ఆలయప్రధాన అర్చకుడు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. దూర ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యుల సహకారంతో తీర్థప్రసాదాలు వితరణ గావించారు.

ఆర్థికాభివృద్ధికి గణాంకాలు దోహదం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జనార్దననాయుడు

పాలకొండ రూరల్ : గణాంకాలు దేశ ఆర్థిక వ్యవస్థలో ఎంతగానో దోహదపడతాయని పాలకొండ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.జనార్దననాయుడు అన్నారు. జాతీయ గణాంక దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అర్థశాస్త్రం, గణిత శాస్త్రాల ఆవశ్యకతపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.ప్రభాకర్, బి.రాజు, అధ్యాపకులు సీహెచ్ రాఘవేంద్రనాయుడు, బీజే మణి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

అక్షరబ్రహ్మ ఆలయం ప్రారంభం



కారిగూడలో అక్షరబ్రహ్మ దేవాలయం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: కారిగూడలోని అక్షరబ్రహ్మ దేవాలయాన్ని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్షరాలే దైవాలుగా పూజించడం అనాదిగా వస్తుందన్నారు. అక్షరంలోనే ఆదివాసీలు దైవాన్ని చూస్తారన్నారు. లిపికి పూజ చేస్తే సకల దేవతలకు పూజించినట్లేనన్నారు. మంగయ్య గొమాంగో పదేళ్ల పాటు కష్టపడి 1936లో సవరభాషకు లిపి తయారు చేయడం జరిగిందన్నారు. ఆయన కృషి శ్లాఘనీయమన్నారు. ఈ లిపిలో 24 అక్షరాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

‘నీరుపేద’ల హర్షాతిరేకం

- వర్షాధార భూములకు తోటపల్లి నీరు
- గాదెలవలస వద్ద జరుగుతున్న కాలువ పనులు
- 7,350 ఎకరాలకు తీరనున్న సాగు ఇబ్బందులు
- ఎమ్మెల్యే అలజంగి జోగారావు చొరవతో నిధుల విడుదల



తోటపల్లి కాలువనుంచి వర్షాధారభూములను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు(ఫైల్)



దయానిధిపురం వద్ద నిర్మించిన కాలువ

సీతానగరం: వర్షాధారంతో పంటలు పండిస్తున్న బలిజిపేట, సీతానగరం మండలాల్లోని భూములకు ఖరీఫ్ సీజన్‌కు తోటపల్లి కుడి కాలువద్వారా సాగు నీరు పంపిణీ చేయడానికి కాలువల నిర్మాణం చురుగ్గా జరుగుతోంది. ఈ మేరకు అప్పట్లో పనులు పనులు ప్రారంభించినప్పటికీ సాంకేతిక పరమైన ఇబ్బందులు రావడంతో నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా అదనపు అయకట్టు భూములకు సాగు నీరందించాలని ఆయామండలాల రైతులు ఎమ్మెల్యే అలజంగి జోగారావును కోరడంతో ఆయన స్పందించి ప్రభుత్వంపై తెచ్చిన ఒత్తిడి మేరకు నిధులు మంజూరయ్యాయి. ఈ క్రమంలో కాంట్రాక్టర్లు గాదెలవలస వద్ద కాలువ పనులు ప్రారంభించారు. చిన్న కాలువల పనులు చురుగ్గా జరుగుతుండడంతో ఖరీఫ్ సీజన్‌కు సాగు నీరందించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సీతానగరం మండలంతో పాటు బలిజిపేట మండలంలోని పలు గ్రామాల రైతులకు చెందిన 7,510 ఎకరాలకు సాగు నీరు అందించడానికి సంబంధిత ఉన్నతాధికారులు పనులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా యంత్రాలతో దయానిధిపురం, గాదెలవలస, గ్రామాల వద్ద యంత్రాలతో కాలువ పనులు చేస్తుండడంతో ఈ ఖరీఫ్ పంటలు సాగుకు నీరు వస్తుందన్న ఆశతో ఆయకట్టు రైతులు ఉన్నారు. రైతులు ఏటా ఎదుర్కొంటున్న పంటనష్టాన్ని అధిగమించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



గాదెలవలసవద్ద జరుగుతున్న కాలువ నిర్మాణం

ఖరీఫ్ సీజన్‌లో సాగునీరందించేందుకు చర్యలు

తోటపల్లి ప్రధాన కుడి కాలువపై బ్రాంచి కాలువ నిర్మాణం జరుగుతోంది. ప్రధాన కాలువపై కల్వర్టు నిర్మించాం. వర్షాధార భూములకు తోటపల్లి కాలువద్వారా సాగు నీరు అందించడానికి ఇప్పటికి 20 కిలోమీటర్ల పొడవునా బ్రాంచ్‌కాలువ పనులు జరగడం వల్ల ఈఖరీఫ్ సీజన్‌లో 4 వేల ఎకరాల భూములకు సాగునీరు అందించడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఈ మేరకు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. వాతావరణం అనుకూలిస్తే మరో 2 వేల ఎకరాలకు సాగునీరు అందించడానికి చర్యలు తీసుకుంటాం.

– రఘునాథనాయుడు, డీఈ తోటపల్లి ప్రాజెక్ట్, సీతానగరం

మున్సిపాలిటీలో అభివృద్ధి పనుల పరిశీలన



కాలువ పనులను పరిశీలిస్తున్న ఉపముఖ్యమంత్రి, గిరిజనసంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: స్థానిక మున్సిపాలిటీ పరిధి శివాజీబొమ్మ కూడలి వద్ద జరుగుతున్న కాలువ పనులను ఉపముఖ్యమంత్రి, గిరిజనసంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర గురువారం పరిశీలించారు.

ఈ మేరకు శివాజీ బొమ్మ జంక్షన్ నుంచి జన్ని వీధి వరకు 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.20 లక్షలతో జరుగుతున్న కాలువ పనులు పరిశీలించిన ఆయన త్వరగా పూర్తిచేయించాలని అధికారులను కోరారు.

కాగా దశాబ్దాల నుంచి డ్రైనేజీతో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తమ వద్దకు వచ్చిన రాజన్నదొరకు ప్రజలు ఈ సమస్యను తీసుకువెళ్లారు. దీనికి వెంటనే స్పందించిన రాజన్న దొర డ్రైనేజీ మంజూరుచేయడంతో పాటు పనులు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు.

వేడుకగా ఏకాదశి పూజలు



కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు



పార్వతీపురం:

తొలి ఏకాదశి సందర్భంగా మండలంలోని సంగంవలస గ్రామంలో రామమందిరం వద్ద గురువారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. గ్రామంలోని జై సంతోషిమాత భజన బృందం ఆధ్వర్యంలో 108 రామమందిరాల్లో 108 భజనలను దిగ్విజయంగా పూర్తిచేశారు. ఈ సందర్భంగా ఏకాదశి పర్వదినాన గ్రామంలోని రామమందిరం వద్ద కుంకుమ పూజలు, అర్చనలు చేశారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన కోలాటం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. 108 భజనలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం రామమందిరం వద్ద అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు భజన బృందం సభ్యులు తెలిపారు.

అత్యవసర చికిత్స త్వరగా అందించాలి



సూచనలు చేస్తున్న డీఐఓ జగన్మోహనరావు

పార్వతీపురం టౌన్: అత్యవసర పరిస్థితులలో ప్రథమ చికిత్సను వీలైనంత త్వరగా అందజేయడం ద్వారా ప్రాణాపాయ స్థితినుంచి వ్యక్తిని కాపాడవచ్చునని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐఓ) టి.జగన్‌మోహన్ రావు అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన జిల్లా ఆస్పత్రిలో సీహెచ్‌ఓలకు అత్యవసర సేవలపై నిర్వహిస్తున్న శిక్షణను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అత్యవసర చికిత్స విధానం ద్వారా గ్రామీణ ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని సూచించారు. పాము, కుక్కకాటుకు చికిత్స, ఐటి ఇమ్యునైజేషన్, గాయాలకు కుట్లు వేయడం, డ్రెస్సింగ్ చేయడం, శ్వాసకోశ సంబంధిత రోగాలకు ప్రథమ చికిత్స అందించడంవల్ల మారుమూల ప్రాంత ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. శిక్షణలో ప్రోగ్రాం అధికారి డా.నవీన్‌కుమార్, ట్రైనర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

జేసీఎస్ కన్వీనర్ల నియామకం



గంటేడ శ్రీరాములునాయుడు | బంకపల్లి వాసుదేవరావు | గొర్లి మాధవరావు | ఉపద్రష్ట సురేష్‌కుమార్

పార్వతీపురం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌లను నియమించింది. ఈ మేరకు బలిజిపేట మండలానికి గంటేడ శ్రీరాములు నాయుడు, పార్వతీపురానికి బంకపల్లి వాసుదేవరావు, పార్వతీపురం మున్సిపాల్టీ గొర్లి మాధవరావు, సీతానగరం మండలానికి ఉపద్రష్ట సురేష్‌కుమార్‌లు నియమితులయ్యారు.

సీపీఎం మండల కమిటీ రాజీనామా



సమావేశమైన సీపీఎం మండల కమిటీ

మక్కువ: సీపీఎం మండల కార్యదర్శి చింతల తవిటినాయుడు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు పార్టీకి రాజీనామా చేశారు. ఎస్ఎస్ పాఠశాల ఆవరణలో గురువారం సమావేశం నిర్వహించిన సమావేశంలో కార్యదర్శి తవిటినాయుడు మాట్లాడుతూ జిల్లా సీపీఎం నాయకుడు రెడ్డి శ్రీరాములు మరణానంతరం జిల్లాలో పార్టీ ప్రతిష్ట దిగజారిందని ఆందోళన వ్యక్తం చేశారు. అనేక ఆరోపణలు ఉన్న నాయకుడిని జిల్లా కార్యదర్శిగా నియమించినందుకు రాజీనామా చేశామని చెప్పారు. రాజీనామా లేఖను జిల్లా కార్యదర్శికి పంపించామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు సీపీఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగుల సేవలు చిరస్మరణీయం



గణపతిరావు దంపతులను సత్కరిస్తున్న, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ గురుకులాల కోఆర్డినేటరు టి పద్మజ, ఉపాధ్యాయులు

సీతానగరం: ఉద్యోగులకు పదోన్నతి, ఉద్యోగ విరమణ, బదిలీ తప్పనిసరి అయినప్పటికీ విధి నిర్వహణలో వారందించిన సేవలు చిరస్మరణీయంగా ఉండిపోతాయని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ గురుకులాల కోఆర్డినేటరు టి.పద్మజ అన్నారు. ఈ మేరకు మండలంలోని జోగింపేట డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో మేథ్స్ అసిస్టెంట్‌ వద్ల మాని లక్ష్మీగణపతిరావు ఉద్యోగవిరమణ సన్మాన సభ ప్రిన్సిపాల్ కె ఈశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె జోగింపేట గురుకుల విద్యాలయంలో ఉద్యోగవిరమణ చేసిన లక్ష్మీగణపతిరావు దంపతులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక గురుకుల అధ్యాపకులు, ఉపాధ్యాయులు, గతంలో సేవలందించిన సహచర ఉపాధ్యాయులు, బంధువులు లక్ష్మీగణపతిరావు దంపతులను సత్కరించారు. సన్మాన గ్రహీత లక్ష్మీగణపతిరావు మాట్లాడుతూ మూడు జిల్లాల్లో ఉపాధ్యాయుడిగా పనిచేశానని చెప్పారు. విధుల్లో తనకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

అర్హులకు సంక్షేమపథకాలు



సమీక్షిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: అర్హులకు సంక్షేమ పథకాలను అందించాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన పట్టణంలోని బెలగాంలోగల 7వ వార్డు సచివాలయాన్ని సందర్శించి జగనన్న సురక్ష పథకంపై సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ ఒక్క లబ్ధిదారుకు కూడా సంక్షేమ పథకాలు అందని పరిస్థితి ఉండకూడదని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా రూపొందించారని చెప్పారు. ప్రభుత్వం అందించే వివిధ రకాల అత్యవసర సేవలు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. జూలై 1 నుంచి కొత్తవలస ప్రాంతంలో జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ రవికుమార్, జేసీఎస్ కన్వీనర్ జి. మాధవరావు, కన్వీనర్లు ఎస్.శ్రీనివాసరావు, శేషు, గురురాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం దృష్టికి భామిని సమస్యలు



సీఎం జగన్‌కు వినతిపత్రం అందజేస్తున్న సింహాచలం

భామిని: పార్వతీపురం మన్యం జిల్లా చినమేరంగికి బుధవారం వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి భామిని మండల సమస్యలను తీసుకువెళ్లినట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితులు తోట సింహాచలం గురువారం తెలిపారు. భామినిలో డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని, ఏబీ రోడ్డు పనులు మధ్యలో ఆపేయడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని, నేరడి బీ, కాట్రగడ బీ, బాలేరు గ్రామాల వద్ద వంశధార నదిపై ప్రతిపాదించిన లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు మంజూరు చేయాలని కోరినట్టు తెలిపారు. వంశధార ప్రాజెక్టు పనుల్లో బాలేరు గ్రామానికి వచ్చే గెడ్డ దారి మళ్లిందని, దాన్ని యథావిధిగా బాలేరు చెరువులకు నీరు అందేలా ఆదేశాలు ఇవ్వాలని కోరినట్టు పేర్కొన్నారు.

భక్తి శ్రద్ధలతో బక్రీద్



నమాజ్ చేస్తున్న ముస్లిం సోదరులు

సాలూరు:

పట్టణం, మండలంలోని ముస్లిం సోదర, సోదరీమణులు బక్రీద్ పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో గురువారం జరుపుకున్నారు. ఈ మేరకు స్థానిక మసీదులకు వెళ్లి నమాజ్ చేశారు. సున్ని జామియా మసీద్ ప్రెసిడెంట్ షేక్‌ఇమామ్‌బాషా, షేక్ ఇక్బాల్, కో ఆప్షన్ మెంబర్ షేక్ ముతార్ బాషా, జామియా ఇమామ్ మొహమ్మద్ ఫ్రాంక్ గని, మౌజన్ మహమ్మద్ ఫయాజ్ రాజా, జామియా మసీద్ కమిటీ, మదీనా కమిటీ, మౌలాలీ కమిటీ సభ్యులు ముస్లిం సోదులతో ప్రత్యేక నమాజ్ చేయించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జర్జాపు సూరిబాబు ముస్లిం సోదరులను కలిసి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం

పాలకొండ రూరల్: సీజనల్ వ్యాధులపై అవగాహన పెంచుకోవాలని ఎం.సింగుపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కడియం చిరంజీవి అన్నారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా గురువారం జంపరకోట గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దోమ తెరల వాడకంపై అవగాహన కల్పించారు. దోమల వలన మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలే అవకాశముందని, వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎస్.భూలక్ష్మి, ఎస్.ప్రసాద్, వైద్య సిబ్బంది మోహనరావు, భువనేష్, టి.రామలక్ష్మి, పెంటయ్య, శారద పాల్గొన్నారు.

అభాగ్యులకు అండగా సీఎం సహాయనిధి



బాధితురాలికి రూ.2 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: ముఖ్యమంత్రి సహాయనిధి అభాగ్యులకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. పాలకొండ నగర పంచాయతీలోని 16వ వార్డుకు చెందిన ఆడంగి గాయత్రికి రూ.2 లక్షల సీఎం సహాయనిధి చెక్‌ను ఎమ్మెల్యే కళావతి గురువారం వండవ క్యాంపు కార్యాలయం వద్ద అందజేశారు. ఈమె భర్త ఆడంగి కిషోర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఈ కుటుంబ ఆర్థిక పరిస్థితులను స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్యే కళావతికి తెలియజేశారు. వెంటనే బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని ఎమ్మెల్యే కళావతి వీరి పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో ఆ కుటుంబానికి సీఎంఆర్‌ఎఫ్ నుండి ప్రభుత్వం రూ.2 లక్షలు మంజూరు చేసింది. ఈ మొత్తాన్ని మృతుని భార్య గాయత్రికి అందజేశారు. వీరితో పాటు వంగర ఎంపీపీ సురేష్ ముఖర్జీ, వైఎస్సార్‌సీపీ నాయకులు కోడెం విజయ్‌కుమార్, తుమ్మగుంట శంకరరావు, కడగల రమణ తదితరులు ఉన్నారు.

గిరిజనుల మధ్య చిచ్చు పెట్టడం తగదు

గుమ్మలక్ష్మీపురం: ఇళ్ల స్థలాల పేరుతో గిరిజనుల మధ్య చిచ్చుపెట్టడం సరికాదని సీపీఎం నాయకులు కోలక అవినాష్, మండంగి రమణ అన్నారు. గురువారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడారు. గుమ్మలక్ష్మీపురం అటవీ శాఖకు చెందిన ఎల్విన్‌పేట బీట్ (జే.కే పాడు వన సంరక్షణ సమితి)లోని అటవీ ప్రాంతాన్ని తోలుఖర్జ, మంగళాపురం తదితర గ్రామాలకు చెందిన గిరిజనులకు ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామంటూ కొంత మంది గిరిజనేతరులు వారిచే ఆ అటవీ ప్రాంతం ఆక్రమించుకునేలా ప్రోత్సాహించారని చెప్పారు. ఆ అటవీ ప్రాంతంపై హక్కులున్న జేకే పాడు, ఎస్‌కే పాడు, జేకే పాడు కాలనీ, ఎల్విన్‌పేట గ్రామాలకు చెందిన గిరిజనులతో గొడవలకు దించి చిచ్చు పెడుతుండడం హేయమైన చర్య అన్నారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.